క్లుప్తంగా

ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల వినతి

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ బుధవారం బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు ఆయన క్యాంపు కార్యలయంలో వినతిపత్రం అందజేశారు. మార్కెట్ ఏర్పాటుకు మరో చోట ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య, బెజవాడ శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, కౌన్సిలర్లు గాజుల మురళి, పులిజాల లక్ష్మీ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కుందూరు జైవీర్‌రెడ్డి

త్రిపురారం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి చేపట్టిన గిరిజన చైతన్య పాదయాత్ర బుధవారం త్రిపురారం మండలంలోని కాపువారిగూడెం గ్రామం నుంచి కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి పాదయాత్రను కొనసాగించారు. గిరిజనులు తమ సాంప్రదాయ నృత్యాలతో పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుగు తండాలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జైవీర్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పానుగోతు దూద, పానుగోతు రాములు, పానుగోతు లక్పతి, పానుగోతు రవి, పానుగోతు హనుము, రమావత్ శ్రీను, ధనావత్ చీర, ధనావత్ తీప్య, పానుగోతు సుక్కోలు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవికుమార్, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

వడ్డీతో సహా రుణమాఫీ చేయాలి



తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ: గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.లక్ష రుణమాఫీని వడ్డీతో సహా అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు లావుడియా ఎర్రనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగున్నర సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వడ్డీతో సహా రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటిరెడ్డి, పాపానాయక్, వినోద్, దయానంద్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థులను బరిలో నిలబెడతాం



అభివాదం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీసీ అభ్యర్థులను పోటీకి నిలబెడతామని సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బొంగు ప్రసాద్ గౌడ్, ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగే ప్రభాకర్, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాస్‌రామ్ నాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అరోరా కళాశాలలో నిర్వహించిన సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ నియోజకవర్గ స్థాయి సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. బీసీ గణనను చేపట్టడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం జరుగుతున్న ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కోఆర్డినేటర్ కేవీ గౌడ్, ఎస్‌టీపీఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు ఆకర్ష్ శ్రీరామోజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి చేయూత



నాగార్జునసాగర్: హిల్‌కాలనీ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భగత్



మిర్యాలగూడ: వాడపల్లి అగస్త్యేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దేవరకొండ: మసీదులో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నాగార్జునసాగర్: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ చేయూత అందిస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ మసీదులో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దేవాలయాల్లోని పూజారులకు గౌరవ వేతనం ఇచ్చినట్లుగానే మసీదుల్లోని మతాధిపతులకు ప్రభుత్వం వేతనాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణ అనూషారెడ్డి, వైస్ చైర్మన్ బిన్ని, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ణ బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు అబ్బాస్, బషీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

హాలియా: తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే భగత్ అన్నారు. అనుముల మండలంలోని పేరూర్ గ్రామంలో గల స్వయంభూ సోమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం నియోజకవర్గంలో కొత్తగా 25మంది పూజారులకు ధూపదీప నైవేద్యం కింద నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా, నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్లు వెంపటి పార్వతమ్మ, కర్ణ అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ధూళిపాల రామచంద్రయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, సర్పంచ్ సుధారాణి, పేరూర్ ఆలయ చైర్మన్ రాయనబోయిన రామలింగయ్య తదితరులు ఉన్నారు.

అన్ని మతాలకు సముచిత స్థానం

హాలియా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలోని అన్ని మతాల వారికి సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం హాలియా పట్టణంలో కర్మెలు క్రైస్తవ ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, నిడమనూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోలే డేవిడ్, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు నంద్యాల ఎలీషారావు, జనరల్ సెక్రటరీ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సర్వమత సంప్రదాయాలకు ప్రాధాన్యం

దేవరకొండ: సర్వమత సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని ఖలందర్ షా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ రాహత్ అలీ, కమిషనర్ వెంకటయ్య, టీవీఎన్ రెడ్డి, ముఫ్తీ జావిద్ హుస్సేన్, రయీస్, తౌఫిక్, జయప్రకాష్ తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని కోదండాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపు రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఏడుకొండల్‌యాదవ్, పరమేష్, అంజిరెడ్డి, సిరసువాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హాలియా: క్రైస్తవ ప్రార్థనా మందిరంలో మాట్లాడుతున్న రాంచందర్‌నాయక్

పెద్దవూరలో..

పెద్దవూర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని బట్టుగూడెం గ్రామంలో గల ఇష్ట కామేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దవూర ఎస్ఐ పచ్చిపాల పరమేష్, చైర్మన్ చెన్ను వెంకట్‌రెడ్డి, ఆలయ ప్రధాన పూజారి అనంతరామశర్మ, కూన్‌రెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో ఎమ్మెల్యే పూజలు

మిర్యాలగూడ: ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని శివాలయం, పెద్ద మసీదు, వినోభానగర్‌లోని జీవమార్గం ప్రార్థనా మందిరం, దామరచర్ల మండలంలోని వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర ఆలయంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండీ యూసుఫ్, కుర్ర విష్ణు, లలితాహోటీ రాం, నూకల సరళాహన్మంతరెడ్డి, ధీరావత్ నందినీరవితేజ తదితరులు ఉన్నారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



మిర్యాలగూడ: జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

మిర్యాలగూడ: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, ఎంపీపీ నూకల సరళ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సైదులుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణ, నాయకులు గడగోజు ఏడుకొండలు, నవాబ్, గోవిందరెడ్డి, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, శ్రీనునాయక్, జయప్రకాష్, రయీస్, ప్రదీప్ తదితరులున్నారు. అదేవిధంగా దేవరకొండ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, కంబాలపల్లి వెంకటయ్య తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎర్ర ఆంజనేయులు, చొల్లేటి భాస్కరాచారి, విఠలాచారి, అబ్దుల్ కలాం తదితరులున్నారు.

హాలియాలో..

హాలియా: పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్‌తో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్ణ అనూష, బీఆర్‌ఎస్ అనుముల, త్రిపురారం మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, బహునూతన నరేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మంద రఘువీర్, బిన్నీ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి–నార్కట్ బైపాస్ నందిపహాడ్‌వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు గడగోజు చంద్రశేఖర్, మండలోజు సైదాచారి, చేర్యాల వెంకటాచారి, గుంటోజు మధు తదితరులున్నారు.

కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షమయ్యగౌడ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నర్సింగ్ కోటయ్య, జె.నరేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ కేర్ టేకర్ శ్రీను, ఫ్రాన్సిస్ తదితరులున్నారు.



దేవరకొండ: జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



హాలియా: జయశంకర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భగత్ తదితరులు

అనుమతిలేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న ఐ ప్లే స్కూల్ అండ్ విజార్డ్ స్కూల్ ఆఫ్ ఇంటెలిజెన్స్ పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు ఎలాంటి అనుమతి లేదని, బిల్డింగ్ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి. వెంకటేష్, రాహుల్, రవి, చందు, బాబులాల్, రాము, అఖిల్, మధు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలు చేయడం తగదు



మిర్యాలగూడ ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: అడ్మిషన్ల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజు వసూలు చేస్తున్న మిర్యాలగూడ పట్టణంలోని సంస్కృతి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి స్కూల్లో కేవలం అడ్మిషన్‌కే రూ.30వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న సంస్కృతి, నారాయణ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జగన్ నాయకులు వదూద్, మధు, అఖిల్, కిరణ్, కిషోర్, మహేష్, కోటేష్, సంతోష్ తదితరులున్నారు.

ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

మిర్యాలగూడ టౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలని ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, మాలమహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి ఈళ్లపల్లి సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్య వ్యాపారంగా మారిందని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కొన్ని పాఠశాలలు తమ వద్దనే పుస్తకాలు కొనాలనే నిబంధనలు పెడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సాంబయ్య, చంద్రబాబు, రమేష్, శ్రీను, గంగాధర్, రామ, సునీత తదితరులున్నారు.

గాలి వాన బీభత్సం

హాలియా: అనుముల మండలంలో మంగళవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో తిమ్మాపురం గ్రామంలో పలువురి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. కొందరి ఇళ్లు కూలిపోయాయి. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

కాంగ్రెస్ నేతల పరామర్శ..

తిమ్మాపురంలో ఇళ్లు కూలిపోయిన బాధితులను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి పరామర్శించారు. నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట కుందూరు రాజేందర్ రెడ్డి, గుర్రం అమరేందర్‌రెడ్డి, బద్దెపాకు విగ్నేష్ తదితరులు ఉన్నారు.



హాలియా: గాలి వానకు తిమ్మాపురంలో ఎగిరిపోయిన రేకులు, కూలిన గోడ

ఇంటిపై కూలిన వేప చెట్టు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో స్థానికంగా నివాసముంటున్న చెన్నబోయిన గురువయ్య ఇంటి పైకప్పు రేకులపై వేప చెట్టు పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.

కార్పొరేట్ విద్యకు 'ఆదర్శ' విద్యార్థులు ఎంపిక

నిడమనూరు: నిడమనూరు ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసుకున్న ఆరుగురు విద్యార్థులు ప్రభుత్వం నుంచి ఉచిత కార్పొరేట్ విద్యకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రంజిత బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన కొండోజు ప్రసన్న, మెగావత్ శివరామ్‌కు నల్లగొండలోని గౌతమి జూనియర్ కాలేజీలో, దానబోయిన మధుశంకర్, జిల్లేపల్లి దుర్గాప్రసాద్, కట్టెబోయిన లేఖ్య, అమృతలూరి చరణ్‌కు నల్లగొండలోని ప్రగతి జూనియర్ కాలేజీలో ఉచితంగా ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం లభించింది. రెండు సంవత్సరాల పాటు వీరికి ఉచిత విద్యతో పాటు ఉచిత హాస్టల్ వసతి కూడా కల్పిస్తారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రంజిత, అధ్యాపక బృందం అభినందించారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత



దేవరకొండ: యోగా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు



పెద్దవూర: చలకుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



మాడుగులపల్లి టోల్ ప్లాజా వద్ద యోగా చేస్తున్న సిబ్బంది



త్రిపురారం: బాబుసాయిపేట పాఠశాలలో యోగాసనాలు నేర్పిస్తున్న హెచ్ఎం

దేవరకొండ: నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ పట్టణంలోని స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం యోగా గురువు కుకుడాల వెంకటేశ్వర్లు యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, పంతులాల్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, రాజ్‌కుమార్, తాళ్ల సురేష్, ఉమామహేశ్వర్, భాస్కర్, రమేష్ తదితరులున్నారు.

నిత్యం యోగా సాధన చేయాలి..

మిర్యాలగూడ: ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ యోగా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో యోగా క్లబ్ అధ్యక్షుడు మాలోతు దశరథ నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, లింగయ్య, పరమేష్, వెంకటయ్య, సురేష్ తదదితరులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: పట్టణంలోని అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ పాల్గొని మాట్లాడుతూ.. ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆలోచనా శక్తి, ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. అనంతరం ట్రాన్స్‌జెండర్స్‌తో యోగా చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

డిండి మండలంలో..

డిండి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డిండి మండల కేంద్రంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ రాధికాకృష్ణ, సుజాత, రాములు, కేశవులు, మల్లయ్య, జైపాల్, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. యోగా విశిష్టత గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్ఎంలు కె. శ్రీనివాస్, జార్జ్, డి. బాలాజీ, లక్ష్మీకాంత్‌రెడ్డి, సుదర్శన్, హిమవంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ కట్టా వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి యోగా గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉపేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఆరోగ్య బోధకుడు సత్యనారాయణరెడ్డి, బేబి మౌనిక, విజయలక్ష్మి, మాధవి తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లిలో..

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సాయి కృష్ణవేణి పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ధ్యానం, యోగాసనాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ చంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, రమణి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

త్రిపురారంలో..

త్రిపురారం: మండలంలోని బాబుసాయిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రధానోపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి యోగాసనాలు వేయించారు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాడుగులపల్లి టోల్ ప్లాజా వద్ద క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ హెడ్ నర్సింగరావు, యోగా గురువు సుధాకర్, టోల్‌ప్లాజా మేనేజర్ వెంకటేశ్వర్లు, నరేష్, మధార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

మిర్యాలగూడ టౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్లు కమ్మంపాటి కిశోర్, బైరోజు శేఖర్ కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో రూ.10వేలు, లోకల్ ఫొటోగ్రాఫర్లు రూ.42వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమన్నారాయణ, పసుపులేటి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి ఎలియాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాచర్ల గిరిప్రకాశ్, ఇన్‌చార్జి సుమన్, మోహన్‌రెడ్డి, నక్క శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

రెండో రోజూ కొనసాగిన నిరాహారదీక్ష

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల ముందు చేపట్టిన నిరాహారదీక్ష బుధవారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపిచంద్, జిల్లా ఇన్‌చార్జి కొత్త అఖిల్ మాట్లాడుతూ.. మార్కెట్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రాకేష్, ఈశ్వర్, ప్రభు, హేమసుందర్ తదితరులున్నారు.

ప్రధాన కార్యదర్శిగా ధర్మానాయక్

త్రిపురారం: మండలంలోని కాపువారిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన నేనావత్ ధర్మానాయక్ త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో కొనసాగిన గిరిజన చైతన్యయాత్రలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ధర్మానాయక్‌కు నియామక పత్రం అందజేశారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

కొండమల్లేపల్లి: కొత్తగా ఈ నెల 16వ తేదీ వరకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో వ్యవసాయశాఖ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ కౌన్సిల్ హాల్ ప్రారంభం

మిర్యాలగూడ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌ను మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరునగరు నాగలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.